క్లుప్తంగా

మానవత సేవలు విస్తరణ

పెనుగొండ: మానవత సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని, సేవలు మరింత విస్తరణకు కృషి చేయాలని పెనుగొండ ఎస్వీకేపీ విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె.రామచంద్రరాజు అన్నారు. బుధవారం రాత్రి పెనుగొండలో ధర్మారెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన మానవత శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా నేమాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా ఏడిటర్ డాక్టర్ నల్లిమిల్లి విజయరాజు, కార్యదర్శిగా అడిగర్ల నరసింహమూర్తి, జాయింట్ సెక్రటరీగా షేక్ మస్తాన్, కోశాధికారిగా బచ్చు లక్ష్మీ నరసింహమూర్తి, ఈసీ ఎమర్జెన్సీ కంబాల మోహన్, ఈసీ ఎడ్యుకేషన్ సీహెచ్ శ్రీనివాసరావు, ఈసీ హెల్త్ మేడపాటి మురళీ జోగిరెడ్డి, ఈసీ ఎవేర్నెస్ కర్రి సురేష్ బాబులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, ఉభయ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ వైవీవీ అప్పారావు, కొత్త సత్యనారాయణమూర్తి, అధ్యక్షుడు డాక్టర్ బాల చందర్ సాదే, ఆచంట, పెనుమంట్ర, రీజనల్ ఛైర్మన్ కర్రి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి కనిపించడం లేదా?

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గంలో జరగుతున్న అభివృద్ధి బొమ్మిడి నాయకర్‌కు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని ఏఎంసీ మాజీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జనసేన నాయకుడు నాయకర్ చీఫ్‌విప్ ప్రసాదరాజును ఏకవచనంతో సంబోధించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని వివరించారు. ఏ పార్టీ నుంచి గెలిచిన నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సమానంగా చూస్తున్నారని, నియోజకవర్గం అభివృద్ధికే ప్రసాదరాజు కృషి చేస్తున్నారని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని లంకలకోడేరు గ్రామంలో సాంకేతిక మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలి

మొగల్తూరు: రైతులు తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని సొసైటీ చైర్మన్ మోటుపల్లి రాంభాస్కరరావు కోరారు. బుధవారం మొగల్తూరులోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. గత దాళ్వా సాగులో రెండు రైతు భరోసా కేంద్రాల ద్వారా సుమారు 34 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, 541 మంది రైతులకు రూ 6.95 కోట్లు చెల్లించామని, మరో 16 మంది రైతులకు వివిద కారణాలతో నగదు జమ కాలేదన్నారు. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సహకారంతో అధికారులను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు ధాన్యం సొమ్ము రైతుల ఖాతాలోకి జమ చేయడంలో సిబ్బంది కృషితో త్వరతగతిన జమ చేశామన్నారు. గత ఏడాది రూ7 కోట్లు వరుకు రైతులకు రుణాలందించగా ఇప్పటి వరుకు సుమారు రూ.6 కోట్లు తిరిగి చెల్లించారన్నారు. రైతులకు ఈ ఏడాది సుమారు 15 శాతం డివిడెండ్ అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు రేవు విజయలక్ష్మీ, బొడ్డుపల్లి సుబ్బారావు, సీఈఓ కొత్తపల్లి గోవిందరాజు, రేవు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలకొల్లు రైల్వే గేటు మూసివేత?

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు భీమవరం రోడ్డులో ఉన్న పాలకొల్లు రైల్వే గేటును నేటి నుంచి మూసివేస్తున్నట్లు సమాచారం. గత 8 ఏళ్ల క్రితం పాలకొల్లు భీమవరం రహదారికి సంబంధించి రైల్వే అధికారులు పూలపల్లి బైపాస్ రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జిను నిర్మించారు. సుమారు రూ.14 కోట్ల వ్యయంతో ఆర్‌ఓబీ నిర్మించామని అందువల్ల తాము రైల్వే గేటును శాశ్వతంగా మూసివేతకు అనుమతి కోసం రైల్వే అధికారులు జిల్లా కలెక్టర్‌ను సంప్రదించారు. దీంతో జిల్లా కలెక్టర్ రైల్వే గేటు మూసివేయడానికి అనుమతి ఇచ్చినట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. దీనిపై పాలకొల్లుకు చెందిన రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యులు జక్కంపూడి కుమార్ స్పందిస్తూ 29న గేటు మూసివేయకుండా రైల్వే అధికారులను సంప్రదించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్‌కు ఇక్కడి సమస్యను తెలియజేయడానికి రెండు రోజులు గడువు ఇవ్వాలని రైల్వే డివిజినల్ అధికారులను అడిగినట్లు తెలిపారు. స్థానిక రాజకీయ నాయకులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో చర్చించి రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి గేటు మూత వేయకుండా ఉండేలా కృషి చేస్తామని అన్నారు.

రామాలయంలో పెరిమాళ్వార్ తిరునక్షత్ర ప్రవచనాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలో పెరియాళ్వార్ తిరు నక్షత్ర మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టువారి సౌజన్యంతో ఆలయంలో మూడు రోజులు పాటు ప్రవచనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుధవారం వంగల సంపత్‌కుమార్ శ్రీ రంగనాథన్‌స్వామి భక్తులకు ప్రవచ విన్నవించారు. గురువారంతో ఈ ప్రవచనాలు ముగించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మార్టేరులో ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు


మార్టేరు సెంటర్‌లో పాలకొల్లు రోడ్డులో నిర్మిస్తున్న బస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


మునమర్రులో ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ

పెనుమంట్ర: మార్టేరు సెంటర్‌లో ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు కల్పించి సెంటర్‌లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం మార్టేరు నాలుగుకూడలి సెంటర్‌లో నిర్మాణాలు జరుగుతున్న నాలుగు బస్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. సెంటర్‌లో కోడేరు రోడ్డులో రూ. 25 లక్షలు గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన సులబ్ కాంప్లెక్స్, బస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులతో పాటు పాలకొల్లు, పెనుగొండ, అత్తిలి రోడ్లలో సుమారు రూ.35 లక్షలు అంచనా వ్యయంతో తన సొంత నిధులతో నిర్మిస్తున్న మూడు బస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించి అందులో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలు గురించి గ్రామ ఉప సర్పంచ్ కర్రి వేణుబాబుకు సూచనలు ఇచ్చారు. గతంలో సెంటర్‌లో ప్రయాణికుల పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూసిన శ్రీరంగనాథరాజు ఆచంటలో ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే తమ సొంత నిధులతో బస్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పంచాయతీ నిధులతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్, కోడేరు రోడ్డులో బస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు దాదాపు పూర్తికాగా, తన సొంత నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు కూడా దాదాపు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంకానున్నాయి. ఈ బస్ షెల్టర్‌లో ఫ్యాన్‌లతో పాటు అధునాతన ఫర్నీచర్‌ను కూడా ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. మార్టేరు సెంటర్‌లో ఆహ్లాదకవాతావరణాన్ని తీసుకురావాలని పంచాయితీ పాలకవర్గ సభ్యులతో పాటు అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసు భాషిణి, సర్పంచ్ మట్టాకుమారి, ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, ఎంపీటీసీ సభ్యులు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సత్యవరం గ్రామ సమస్యలను పరిష్కరించాలి

సత్యవరం గ్రామంలో కుమ్మరిపుంత రోడ్డును తక్షణమే నిర్మించాలని మాజీ మంత్రి, జిల్లాపార్టీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. సత్యవరం గ్రామ సమస్యలను ఆ గ్రామ మహిళలు మంగళవారం ఆయన కార్యాలయానికి వెళ్లి వివరించడంతో బుధవారం అధికారులతో కలిసి వెళ్లి గ్రామంలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పేర్కొన్న పలు సమస్యలను పరిష్కారించాల్సిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామకంఠభూమిలో నివాసం ఉంటున్న ఆ గ్రామానికి చెంది, పేద కుటుంబాలకు చెందిన చెరుకువాడ వరలక్ష్మి, పాలకొలను సావిత్రలకు ఎంజాయిమెంట్ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నల్లమిల్లి ప్రభాకరరెడ్డి, గ్రామ సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యులు గెద్దం ఈశ్వరుడు, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

మునమర్రు స్థల సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ: మునమర్రులో ఇళ్ల స్థలాల సమస్యను సత్వరం పరిష్కరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. బుధవారం మునమర్రులో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజతో కలిసి ఇంటి స్థలాలను పరిశీలించారు. ఇళ్ల స్థలాల విషయంలో అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పేదలందరికీ ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. అధికారులు నిర్లిప్తతతో వ్యవహరిస్తే మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలను సత్వరం పరిష్కరించి 20 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందించి ఇళ్ల నిర్మాణం సత్వరం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సమస్యను సత్వరం పరిష్కరించి పట్టాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట నాగరత్నం, తహసీల్దార్ ఎం.గురుమూర్తి రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాసు పాల్గొన్నారు. అలాగే ములపర్రులో డ్రెయినేజీ, రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని వాటిని సత్వరం పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ములపర్రులో నిర్మాణాలపై సమీక్షించారు. పితాని వారి పాలెం, పెదగరువుల్లో ఇప్పటికే నిర్మాణాలు చేపట్టారని, మిగిలిన వాటిని త్వరలో పూర్తి చేస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కలగట సాగర్, యాండ్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి

పెనుమంట్ర: నిరుద్యోగులు ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం మార్టేరు సెంటర్‌లో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా మంజూరైన మిని ఫిష్ ఆంధ్రా రిటైల్ అవుట్‌లెట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ పథకం ద్వారా పాలమూరు, మాముడూరు, జుత్తిగ, తదితర గ్రామాల్లో కూడా కొత్త యూనిట్‌లను మంజూరు చేసినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జి శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న సురక్షతో మరింత సంక్షేమం

పెనుగొండ: జగనన్న సురక్షతో పేదలకు సంక్షేమం మరింత చేరువ అవుతుందని పెనుగొండ ఎంపీడీఓ శ్రీనివాస్ దొర అన్నారు. బుధవారం ములపర్రు సచివాలయంలో జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనరు సాక సుబ్రహ్మణ్యం, ఎంఎల్‌ఓ నారాయణ రెడ్డి, ములపర్రు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కలగట సాగర్, కేశరపల్లి రమేష్ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

పెనుగొండ: కొడమంచిలిలోని వర్మీ కంపోస్ట్ షెడ్‌ను, డంపింగ్ యార్డును నరసాపురం డీఎల్‌పీవో బలరామరాజు పరిశీలించారు. బుధవారం మధ్యాహ్నం పంచాయతీలో సమీక్ష నిర్వహించిన అనంతరం పరిశీలించారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టి డంపింగ్ యార్డుల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఈఓపీఆర్డీ డి మూర్తిబాబు, కార్యదర్శి డి.నాని పాల్గొన్నారు.

అమ్మ ఒడితో పేద విద్యార్థులకు మేలు

పాలకొల్లు అర్బన్: అమ్మ ఒడి పథకంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతోందని వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని లంకలకోడేరు నెం.2 స్కూల్ ఆవరణలో బుధవారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఆయన ప్రశంసించారు. మాజీ ఎంపీటీసీ కర్ణి జోగయ్య, మండల కోఆర్డినేటర్ తోకల జనార్థన్ తదితరులు పాల్గొన్నారు. పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు పిల్లి శ్రీనివాస్, రత్నకుమారిలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు ఎస్.రాఘవరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల వార్షికోత్సవం


ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థి భవిష్యత్‌లో ఏ రంగంలో అడుగు పెట్టాలనుకుంటున్నామో ఆ లక్ష్యం దిశగానే అడుగులు వేయాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 56వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ విద్యార్థి లక్ష్యం ఎప్పుడూ చిన్నదిగా ఉండకూడదన్నారు. లక్ష్యం ఎప్పుడూ పెద్దగానే ఉండాలన్నారు. తాను 8వ తరగతి చదువుతున్నప్పుడే కలెక్టర్ కావాలనుకున్నానని ఆ లక్ష్యమే నన్ను ఈ స్థాయికి తీసుకువచ్చిందన్నారు. విద్యార్థికి ప్రధానంగా ఉండకూడని లక్షణం ఏమిటంటే నేను అది సాధించలేనేమోననే అభద్రతాభావం ఉండకూడదన్నారు. మనసు పెట్టి చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. ఏ లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నా ఈ వయస్సులోనే సాధ్యమవుతుందన్నారు. ఇతర దేశాల్లో చదువుకోవాలనే లక్ష్యం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం పరంగా సహకరిస్తామని అన్నారు. విద్యార్థి ఆలోచనా స్థాయి కూడా మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాదని అంతర్జాతీయ స్థాయిలో ఆలోచించేంత షార్ప్‌గా ఉండాలన్నారు. దేశానికి నేటి యువతరమే ప్రధాన వనరని సూచించారు. రాబోయే టెక్నాలజీ కాలానికి మనమే బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలనే లక్ష్యంతో విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. కళాశాలలో కొన్ని సమస్యలు తెలిపారని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, సీపీడీసీ సెక్రటరీ డాక్టర్ బీవీ రాఘవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ ఎం.సుబ్బలక్ష్మి, కళాశాల చైర్మన్ ఎస్‌వీ రంగారావు, సెక్రటరీ శ్రీనాథ్, ఇమ్మిడి రాజేష్, అద్దేపల్లి మోహన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉండాలి


పాలకొల్లులో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: పేదలకు విద్య, వైద్యంతో పాటు సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్‌కి ప్రతీ మహిళ అండగా నిలవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పాలకొల్లులో బుధవారం పలు అభివృద్ధి పనులను మంత్రి కారుమూరి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై నిప్పులు చెరిగారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు, దళితులు, పేదల సంక్షేమం కోసం సీఎం జగన్ తపిస్తున్నారన్నారు. విద్య, వైద్యం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పాలకొల్లు సమీపంలో దగ్గులూరులో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పట్టణంలో రూ.60 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్సీ శ్రీనివాస్ వివరించారు. ముందుగా బ్రాడీపేట సమీపంలో రూ.70 లక్షలతో నిర్మించిన మునిసిపల్ అతిథి గృహాన్ని మంత్రి కారుమూరి ప్రారంభించారు. అలాగే రూ.1.09 కోట్లతో రామారావుపేటలో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వాటర్ ఫౌంటేయిన్‌ని మంత్రి కారుమూరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డీటీడీసీ బాబు, చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, పట్టణ యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు పాల్గొన్నారు.

నీతి, నిజాయితీలకు మారుపేరు ముదునూరి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు.

నరసాపురం రూరల్: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును విమర్శించే స్థాయి జనసేన పార్టీ బొమ్మిడి నాయకర్‌కు లేదని, రాజకీయాల్లో హుందాతనంతో గౌరవంగా మెలగాలని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ మెప్పు కోసం నాయకర్ తమ నాయకుడు ప్రసాదరాజుపై నిరాదార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. పవన్ కల్యాణ్ రాష్ట్రం పైన, నాయకర్ నియోజకవర్గంపైనా ముందుగా అవగాహన పెంచుకోవాలని వారు హితవు పలికారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రసాదరాజు రూ.3,200 కోట్లు నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేక నాయకర్, ఆపార్టీ నాయకులు లేనిపోని పసలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారాహి యాత్ర సందర్భంగా కనీసం నాయకర్‌ను ఆ వేదిక పైకి కూడా రానివ్వలేదని రానున్న ఎన్నికల్లో ఆయనకు నరసాపురం టిక్కెట్ వస్తుందో? లేదో? కూడా తెలియదని, ఇది గమనించుకుని ఆయన ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చాగంటి సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ ఇంజేటి జాన్‌కెనడీ, కామన బాల సత్యనారాయణ (బుజ్జి), బర్రి జయరాజు, దొంగ మురళికృష్ణ, అంద్రాజు చల్లారావు, బర్రి శంకర్, బర్రి జయరాజు, భూసారపు జయ, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ తదితరులు ఉన్నారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోవాలి


పోడూరు మండలపరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సబ్బితి సుమంగళి

పోడూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో త్వరలో జరుగనున్న 'జగనన్న సురక్ష' గ్రామసభలను ప్రభుత్వ పథకాలు అందని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సబ్బితి సుమంగళి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సూచించిన తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, విద్యుత్, పారిశుద్ధ్యం, తదితర అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఆయా ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రతి చిన్న సమస్యను మండల పరిషత్ సమావేశంలో చర్చించేదాకా చూడకుండా వీలైనంతవరకు గ్రామ స్థాయిలోనే పరిష్కారం చేసేలా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ సుమంగళి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ, లబ్ధిదారులకు సక్రమంగా అందేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో పర్యవేక్షణ చేయాలని, గ్రామస్థాయి అధికారులకు పిలుపునిచ్చారు. జగనన్న కాలనీల్లో దాదాపు ఇంకా 40 శాతం మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణపనులు ప్రారంభించలేదనీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా వారిని చైతన్యం చేయాలన్నారు. తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు మాట్లాడుతూ మండలవ్యాప్తంగా అర్హులైన కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుందన్నారు. భూయజమానులైన రైతుల అంగీకారంతోనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నామన్నారు. ఎంపీడీఓ డి.సుహాసిని మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు అర్హులై ఉండి ఇంకా పథకాలు అందనివారికి కూడా ఆయా పథకాలు అందించే ధృడ సంకల్పంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి «జగనన్న సురక్ష» కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సమావేశంలో పెనుమదం సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు మానుకొండ శ్రీధర్, పోడూరు, తూర్పుపాలెం సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, గుబ్బల ఉషారాణి, పోడూరు ఎంపీటీసీ-3 పోడూరి నాగరాజారావు, వైస్‌ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఎంఈఓ-2 జి.సూర్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరాజు, పంచాయతీరాజ్ ఏఈ పి.ఏడుకొండలు, సీడీపీఓ సీహెచ్ ఇందిర, ఏఎస్సై జార్జి విక్టర్, ఆర్‌అండ్‌బి జేఈ మూర్తి, వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించాలి


యలమంచిలిలంకలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి: వరదలు, తుఫాన్‌లు, అగ్నిప్రమాదాలు, భూకంపం వంటి ప్రకృతి విపత్తుల సమయంలోను రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో సమయ స్ఫూర్తితో వ్యవహరించాలని 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ పింటు నంది కోరారు. విపత్తుల సమయంలో మనల్ని మనం రక్షించుకోవడంతోపాటు, ఇతరులను కూడా ఏ విధంగా రక్షించాలో వివరిస్తూ బుధవారం యలమంచిలిలంక గ్రామంలో జాతీయ విపత్తుల నిర్వహణ అధికారులు, అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. లంక గ్రామాలలో విరివిగా దొరికే ఎండు కొబ్బరికాయలు, ఖాళీ వాటర్‌బాటిల్స్‌తో లైఫ్ జాకెట్స్ ఏ విధంగా తయారు చేయాలో? వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వల్లభు సాయి వెంకట నరసింహారావు, తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు, ఎంఈఓ కనుమూరు రామకృష్ణంరాజు గ్రామ కార్యదర్శులు పాలా శ్రీనివాస్, పీతల రాజశేఖర్, వీఆర్వో జడ్డు వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అజమాయిషీలోకి టేలర్ ఉన్నత పాఠశాల

నరసాపురం రూరల్: ఎంతో ఘన చరిత్ర కలిగి స్వాతంత్ర్యానికి పూర్వమే స్థాపించిన నరసాపురం టేలర్ ఉన్నత పాఠశాల ప్రభుత్వంలో విలీనం చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానం చేసినట్లు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పోతుల జగన్‌మోహనరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక టేలర్ హైస్కూల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతూ వస్తుందన్నారు. భవిష్యత్‌లో పాఠశాల మూసివేసే పరిస్థితి రావచ్చనే భయాందోళనతో, ఎంతో మంది దాతలు, ప్రభుత్వ సహకారంతో ఉన్నతంగా వెలిగిన టేలర్ హైస్కూల్ పేరు ప్రఖ్యాతలకు భంగం కలగకూడదనే ఉద్దేశంతో పాఠశాల ఎగ్జిక్యూటివ్ బాడీ తీర్మానంతో ప్రభుత్వంలో టేలర్ హైస్కూల్‌ను విలీనం చేయాలని నిర్ణయించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, అనేక పథకాలు అమలు చేస్తూ విద్యార్థుల సంక్షేమానికి పాటు పడుతున్నారని అందుచే తమ పాఠశాలను కూడా ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా తీసుకు వెళ్లామన్నారు. పాఠశాల ఆస్తుల ద్వారా ఏటా సుమారు రూ7.50 లక్షల ఆదాయం స్కూల్‌కు సమకూరుతుందన్నారు. విలీనం సందర్భంగా పాఠశాలకు చెందిన మెయిన్ బిల్డింగ్, బ్రాంచి స్కూల్, ఎలిమెంటరీ స్కూల్, సుమారు 7 ఎకరాల ఆటస్థలం, యలమంచిలి మండలం ఇలపకుర్రు గ్రామంలోని 7 ఎకరాల వ్యవసాయ భూమి, రాయపేట, తదితర చోట్ల ఉన్న భవనాలు, ఖాళీ స్థలాలు కూడా ప్రభుత్వానికి దఖలు అవుతాయన్నారు.

పవన్‌ది వారాహి యాత్ర కాదు నారాహి యాత్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యడ్ల తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: పవన్‌కల్యాణ్ నిజంగా తనకోసమో, జనసేన పార్టీ కోసమో లేక అతన్ని నమ్ముకున్న యువత కోసమో పాటు పడి ఉంటే ప్రజల్లో మంచి గుర్తింపు వచ్చేదని కానీ వారాహి యాత్ర పేరు చెప్పి నారాహి యాత్ర ప్రారంభించారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ విమర్శించారు. బుధవారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించారని మండిపడ్డారు. పవన్ పెట్టిన జనసేన పార్టీ చంద్రబాబు కోసమేనని స్పష్టమవుతుందన్నారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం ముద్రగడ కుటుంబాన్ని రాక్షసత్వంగా హింసిస్తే పవన్ కల్యాణ్ బాబు వద్దకు వెళ్లి శాలువా కప్పించుకుని వచ్చాడన్నారు. వారాహి యాత్ర అంతా జనసైనికులతో టీడీపీ జెండా మోయించడానికే అని ఎద్దేవా చేశారు. సమావేశంలో పెచ్చెట్టి కృష్ణాజి, గంటా నరేష్, చెన్ను విజయ్, జోగి వడ్డికాసులు, పిల్లా శ్రీను, పిల్లా హనుమంతరావు, పాలపర్తి కృపానాథ్, వల్లీ, వెంకట్, పిల్లా అప్పాజి, త్సవటపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం

మొగల్తూరు: మొగల్తూరులో డంపింగ్ యార్డ్ స్థలం సమస్య పరిష్కారం కావడంతో పాలక వర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రెండు ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను రెవెన్యూ అధికారులు పంచాయతీ అధికారులకు అందజేశారు. డంపింగ్ యార్డు స్థలం కోసం చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ గరువులోని రెండు ఎకరాల స్థలాన్ని పంచాయతీకి స్వాధీనం చేయాలని ఆదేశించారు. దీంతో ఆర్ఐ శిరీష, రెవెన్యూ సిబ్బంది ఈవోపీఆర్డీ నవీన కిరణ్, కార్యదర్శి జయరాజు సంబంధిత భూమి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, ఉపసర్పంచ్ బోణం నర్సింహారావు పాల్గొన్నారు.